# అమెరి'కులాసా' కథలు


## – వంగూరి చిట్టెన్ రాజు





### - 5-

# సర్ ఎర్ల్ హికర్సన్ వారి మొదటి ఉద్ధరింపు కథ



కాకినాడలో మా ఇంటి వరండాని అనుకుని ఒక పెద్ద రాచ ఉసిరి చెట్టు ఉంటుంది. నేను వెళ్లినపుడల్లా ఆ వరండాలో కుర్చీలో కూచుని కాఫీ తాగుతూ అ చెట్టునీ, దాని వెనకాలే ఉన్న మామిడి చెట్టునీ, వాటి మీద గెంతుతూ అప్పుడప్పుడు నాకేసి మొహం పెట్టి విచిత్రంగా చూసి గెంతి పారిపోయే మా ఆస్థాన ఉడతనీ చూస్తూ కాలం గడిపేస్తాను. ఇక నన్ను చూడడానికి వచ్చిన వాళ్ళు ఆ ఉసిరి కాయలని చూడగానే నన్ను చూచుట మానేసి చేతికి అంది వచ్చే ఆ రాచ ఉసిరి కాయల్ని కోసేసుకుని వచ్చిన పని అయిపోయింది అని వెళ్లి పోతూ ఉంటారు. నేను వెళ్ళిన పది రోజుల్లోనే అలా చేతికి అంది వచ్చే ఉసిరి కాయలు అన్నీ అందరూ కోసుకు పోయాక మా వదిన గారు కబురు పెట్టారు కాబోలు.. ఒక రోజు ఓ యువకుడు వచ్చి నన్ను చూసి బుర్ర పక్కకి తిప్పేసుకుని నేను కళ్ళు ఆర్పే లోపుగానే హఠాత్తుగా మాయం అయిపోయాడు. అంతలోనే ఈ కుర్రాడు ఏమి పోయాడా అని నేను ఆశ్చర్య పడిపోతుంటే ఆ చెట్టు పై నుంచి రాచ ఉసిరి కాయలు నా నెత్తి మీద రాలి పడ్డం మొదలు పెట్టాయి. తల పైకి ఎత్తి చూద్దును కదా.....ఈ కుర్రాడు ఎప్పుడు, ఎలా ఎక్కాడో తెలీదు కానీ ఆ చెట్టు పై కొమ్మల మీద ఒక సంచీ నడుముకి కట్టుకుని ఉసిరి కాయలు కోసి అందులో వేస్తూ కనపడ్డాడు. ఇదంతా అబద్ధం అనుకుంటున్నారేమో..కావాలంటే అప్పుడు నేను తీసిన ఫోటో ఇక్కడ జత పరిచాను. ఇది చూచుటకు ముచ్చటైన దృశ్యమే కానీ ఈ చెట్టులెక్కగలిగే నరహరి కాలు జారి కింద పడి చస్తాడో, కొమ్మ విరిగి క్రింద పడి చస్తాడో లేక నా మీద పడి చంపుతాడో తెలియక రెండు ఫోటోలు లాగించేసి మా వందేళ్ళ వృద్ధ మామిడి చెట్టు క్రిందకి పారిపోయాను. ఆ తరువాత పది రోజులు మా ఇంట్లోనే కాక మా గాంధీ నగరం లో అందరి ఇళ్ళలోనూ ఉసిరి కాయ పప్పు, ఉసిరి కాయ పచ్చడి, ఉసిరి ఆవకాయ ...అంతా ఉసిరి మయమే!! ఆఖరికి అమెరికాలో మా ఇంతో కూడా ఏడాదికి సరిపడా రాచ ఉసిరి పచ్చడి ఉంది.

ఇదంతా ఇప్పుడు ఎందుకు జ్ఞాపకం వచ్చిందీ అంటే...ఇక్కడ అమెరికాలో మా హ్యూస్టన్ లో కూడా అలాంటి ఉదంతమే మొన్న మా ఇంట్లోనే జరిగింది. ఎటొచ్చీ అక్కడ ఉసిరి చెట్టు అయితే ఇక్కడ అమెరికన్ తాటి చెట్టు...అనగా పేరుకి తాటి చెట్టే కానీ ఉత్తి షోకు మాత్రమే. ఆంధ్రా తాటి చెట్లలా తాటి పళ్లూ, తాటి కల్లూ వగైరాలు నాస్తి. అనగా అమెరికా తాటి చెట్టు క్రింద ధర ఖర్వాటుడు నుంచున్నా వాడి బట్ట తల మీద తాటి పండు పడే డేంజర్ లేదు. అక్కడ కాకినాడ నరహరి ఎగిరి గెంతేసి చెట్టు ఎక్కితే ఇక్కడ చెట్టు ఎక్కిన వాడు నిచ్చెన వీరుడైన మా 72 “చేతి పని వాడు” అంటే ,,అమెరికాలో హేండీమేన్ ..అని పిలవబడే వాడు. వాడిని ‘చేతి వాటం వాడు’ అని కూడా అనవచ్చును కానీ చేతివాటం గాడు అంటే దొంగ వెధవ అనే అర్థం కదా..పాపం మా సర్ హికర్సన్ ని అంత మాట అనదల్చుకోలేదు. తెలిస్తే కొడతాడు కదా...

అసలు అమెరికాలో మధ్య తరగతి సంసారులకి ఒక మంచి హేండీమేన్ దొరకడం లాటరీ లో మిలియన్ డాలర్లు కొట్టడం కంటే ఎక్కువ సమానం. కారణం ఏమిటంటే అమెరికాలో కొనుక్కున్న ఇల్లు, కట్టుకున్న పెళ్లాం ఒక లాంటివే. అన్నీ బావున్నప్పుడు అనుభవిస్తూ మహానందపడతాం. తేడా

వచ్చిందో డామేజీ రిపేరు చేసుకో లేక అడ్డమైన గడ్డీ కరుస్తాం. ఈ హేండీమేన్ అనే వాడు ఇంటికి వచ్చే అనేక రకాల చిన్నా, చితకా రిపేర్లు చేసే సత్తా ఉన్న వాడు. అంటే ఫేమిలీ ప్రాక్టీస్ డాక్టర్ లాంటి వాడు. పెద్ద పెద్ద రోగాల స్పెషలిస్టు కాదు. ఇంట్లో రిపేరుకి హేండీమేన్ లాగా ఇల్లాలి రిపేర్ కి కూడా ఎవరైనా ఉంటే ఎంత బావుండునో కదా! ఆ తంటాలు మటుకు మనమే పడాలి. ఏం చేస్తాం? కిందా, మీదా పడతాం.

నిజానికి ఈ హేండీమేన్ చేసే పనులు చాలానే ఉంటాయి. ఉదాహరణకి అమెరికా వంటింట్లో సింకు లో ఉండే డిస్పోజర్ అనే యంత్రం ఉంటుంది. అందులో తరిగిన కూరగాయల తొక్కలు లాంటి మెత్తటి పదార్థాలు వేస్తే అది హాయిగా వాటిని "తినేసి" నీళ్ళలో కలిపేసి మురుగు కాలవ లోకొ, ఇంకెక్కడికో మనకి తెలియని చోటికి పంపించేస్తుంది. కానీ మా క్వీన్ విక్టోరియా వారానికోసారి ఆవిడ తమ్ముడితో ఫోన్ లో మాట్లాడుతూ ఆ తన్మయత్వంలో ఆ కూరలు తరిగిన కత్తీ, పెసరట్టు వేసిన అట్లకాడా, పచ్చడి వేసుకున్న స్టీలు చెంచాలు వగైరాలు అన్నీ ఆ డిస్పోజర్ లోకి విసిరేస్తుంది. దాంతో అది తిరగ లేక కుయ్యో, మొర్రో అని భోరుమంటుంది. కొండొకచో పొగలు కక్కుతుంది. నేనొక సారి పోటు గాడిలా అలా ఇరుక్కుపోయిన ఆయా వస్తువులు నా చేత్తో బయటకి లాగ బోయి, ఇరుక్కుపోయిన నా చెయ్యి కూడా వెనక్కి లాక్కో లేక గింజు కుంటూ ఉంటే మా క్వీన్ విక్టోరియా నన్ను వెనకాల నుంచి గట్టిగా లాగుతూ నా చేతిని విడిపించడానికి ప్రయత్నిస్తూ ఉండగా మా అమ్మాయి ఆ సీను చూసి అదేదో రొమాన్స్ సీను అని అపార్థం చేసుకుని సిగ్గు పడి మెలికలు తిరిగి పోయింది. వంటింట్లో రొమాన్సా, పాడా...నా మొహం.. ఎలాగో అలాగా ముందు నా చేతిని, వెనకాల మా క్వీన్ విక్టోరియా ఉడుం పట్టునీ విడిపించుకుని, ఆయా వస్తువులని ఆ డిస్పోజర్ కబంధ హస్తాల నుచి పైకి లాగడానికి మా సర్ ఎర్ల్ హికర్ సన్ ని పిలిచాను. అన్నట్టు ఈ డిస్పోజర్ అనే మాటకి నాకు తెలుగు మాట తెలియదు. బయటకి విసిరి వేయు యంత్రము అంటే..ఏమో




నిజానికి ఐదేళ్ళ క్రితం సర్ హికర్సన్ వారు మా ఇంటికి మొదటి సారి వచ్చినప్పుడు కేవలం మా గడ్డి కోయడానికీ, తోటలో కాస్త మొక్కల పని చేయడానికీ వచ్చాడు. మెల్లి మెల్లిగా తను ఇంట్లో పనులు కూడా చెయ్య గలనూ అనీ ఒంటే– డేరా సామెత లాగా అన్నింటి లోనూ దూరి పోయి మా ఇంట్లో మనిషిగా మారిపోయాడు. అదేమిటో తెలీదు కానీ రిపేరు వాడు ఉన్నాడు అని తెలిస్తే ఇంట్లో అన్ని వస్తువులకీ ఏదో రోగం వస్తూనే ఉంటుంది. అయినా మిగతా హేండీమేన్ లాగా మా హికర్ సన్ దొరకి ధన దాహం ఎక్కువ లేదు కాబట్టి బతికి పోయాను. ఉదాహరణకి పైన ఉదాహరించిన "బయటకు విసిరి పోయు యంత్రము" లో ఇరుక్కుపోయిన చెంచాలు బయటకు తీయుట కార్యక్రమానికి మరో 'చేతి వాటం' వాడు అయితే వంద డాలర్లు అడిగే వాడు. ఇతను పాపం ఎర్రగా కంది పోయిన నా చేతి వేళ్ళు, రక్తస్రావం ఆగిపోయిన నా మొహమూ చూసి డబ్బు అడగ లేక గ్లాసుడు మంచి నీళ్ళు మాత్రం అడిగాడు. అంచేత వాడికి నేను ఆ వందా సంతోషంగా ఇచ్చేశాను. నాకున్న రోగాలలో ఒకటి తక్కువ అడిగిన వాడికి ఎక్కువ ఇచ్చి మా క్వీన్ విక్టోరియాతో టెంకిజెల్లలు తినడం, ఎక్కువ అడిగిన వాడికి తక్కువ ఇవ్వ బోయి వాడి చేత చివాట్లు తినడం.

ఇక ఎప్పటి లాగానే ఈ ఏడు కూడా మార్చ్, ఏప్రిల్ రాగానే మా హ్యూస్టన్ లో అందరికీ "వ్యవసాయావేశం" వచ్చింది. అంటే ఇంటి వెనకాల మన వంకాయలూ, బెండ కాయలూ అన్నీ వేసేసుకుని బజార్లో కొనుక్కోడం మానేసి డాలర్లు పోగేసుకుందాం అనే ఆవేశం అన మాట. నిజానికి కిలో వంకాయలు బజార్లో రెండు డాలర్లకే కొనుక్కోవచ్చును కానీ ఇంట్లోనే వంగ మొక్కలు వేసి , పెంచి పెద్ద చేసి అదే రెండు కిలోలు కోసుకోడానికి అంతా లెక్క వేస్తే పాతిక డాలర్లు పైనే అవుతుంది. కానీ అదో తుత్తి మరి. అలాగే నా బోటి వాడు నాలుగు పూల మొక్కలు వేసుకుని ఆనందిద్దాం అని కూడా అనుకుంటారు. అమెరికాలో ఏ ఒక్క పూల మొక్కా సువాసన వెయ్యడం నేను ఏనాడూ చూడ లేదు. అన్నీ చూపులకి సుందరాంగులే. ఇవి మటుకు బజార్లో చాలా ఖరీదు. అంచేత ఇంట్లో పూల మొక్కలు వేసుకోవడం చాలా తుత్తే!. ఇక కొందరు కూర గాయ మొక్కలూ, పాదులూ ఎవరికీ ..ముఖ్యంగా రోడ్డు మీదకి కనపడకుండా గరాజ్ వెనకాల వేసుకుంటారు. ఎందుకంటే ఇవి ఏవైనా గంజాయి మొక్కలు అనుకుని పోలీసులు మూసేస్తారేమో అని భయం. ఉదాహరణకి మన ప్రియతమ గోంగూర మొక్క చూడడానికి అచ్చు మారువానా మొక్క లాగా ఉంటుంది. మొదటి సారి అది చూసినప్పుడు మా సర్ హికర్సన్ గారు హడిలి పోయి నాకేసి చూసిన నల్ల చూపు ఎప్పటికీ మర్చిపోలేను.

ఈ సీజన్ లో మొక్కలు వెయ్యడానికి ముందు చలి కాలంలో చచ్చిపోయిన మొక్కలూ, తోటలో ఉండే ఇతర చెత్తా చెదారం శుభ్రం చేసి ఆ నేలంతా శోభనం నాటి పట్టు పరుపులా చెయ్యకపోతే వసంత ఋతువులో మొక్కలు మొలవ్వు. పువ్వులు పుయ్యవు. వంకాయలు కాయవు. అలా ఏదైనా శుభ్రం చెయ్యాలంటే మా ఎర్ల్ హికర్సన్ ముందు అంతా ఛండాలం చేసి పెట్టి కానీ శుభ్రం చెయ్యడం మొదలు పెట్టడు. వీడికి ఆ క్వీన్ విక్టోరియా 'మల్చ్ వీరుడు' అనే ముద్దు పేరు కూడా పెట్టింది. ఎందుకంటే మా తోటలో ఏ పని చెప్పినా, వాడు ముందు ఓ డజను మల్చ్ బస్తాలు పట్టుకొచ్చి మధ్యలో పడేస్తాడు. అసలు ఈ మల్చ్ అనే ఘన పదార్ధం పేరు నేను ఇండియాలో ఉండగా ఎప్పుడూ విన లేదు. అది నిజానికి బంక  మట్టా, రంపం పొట్టా, ఆవు పేడా, బెరడు ముక్కలా..అన్నీ కలిపి రంగరించి తెల్ల దొర కనిపెట్టిన సరి కొత్త పదార్థమా నాకు బొత్తిగా అవగాహన లేదు. అయినా సర్ హికర్ సన్ వారి ధర్మమా అని ప్రతీ ఏడూ బస్తాల కొద్దీ కొంటునే ఉన్నాను.  అతనికి మా క్వీన్ విక్టోరియా తో హాట్ లైన్ ఉంది. వాళ్ళిద్దరూ మాట్లాడేసుకుని ఆ బిల్లు నా మొహాన కొడతారు. ఏం చేస్తాం? చచ్చినట్టు కట్టుకుంటాం.



మా హికర్ సన్ దొర వారికి మరో దారుణమైన దుర్గుణం ఉంది. అదేమిటంటే ఆ పెద్ద మనిషి మా తోటలో  పని  తెల్లారగట్ట ఆరింటికి...అనగా సూరీడు పొద్దు పొడవగానే మొదలు పెడతాడు. ఏ రోజైనా నేను దున్న పోతులా పడుకుని నిద్ర పోతున్నప్పుడు మా కిటికీ లోంచి అతి పెద్ద ధ్వనులు, చప్పుళ్ళు, లాన్ మూవర్ అరుపులు,..ఒకటేమిటి చెవులు గళ్ళు పడిపోతూ ఉంటే ఈయన రంగ ప్రవేశం చేశాడనమాట. క్రిందటి వారం సరిగ్గా అలాగే..అంటే యముడి వాహన అవతారంలో విశ్రమిస్తున్నప్పుడు...వెనకాల తోటలో అరివీర భయంకరమైన చప్పుళ్ళు వినపడగానే ..అరె మొన్ననే కదా గడ్డి కోసి వెళ్ళాడు, మళ్ళీ వచ్చాడేమిటి చెప్మా  అని చూడడానికి వెళ్లినప్పుడు నాకు కనపడిన దృశ్యమే సదరు సర్ ఎర్ల్ హికర్ సన్ దొర గారు తాటి చెట్టుకి నిచ్చెన వేసి ఎండిపోయిన ఆకులు పెద్ద యంత్రంతో కత్తిరించడం. అది చూడగానే నాకు మా కాకినాడ ఉసిరి చెట్టు కుర్రాడు రకీమని జ్ఞాపకం వచ్చాడు. అలవాటు ప్రకారం ఇప్పుడు కూడా అర్జంటుగా ఓ ఫోటో లాగేసి ఇప్పుడు వీడు కూడా కింద పడి చస్తాడా లేక చావకుండా మా ఇంట్లో కింద పడినందుకు నా మీద మిలియన్ డాలర్ల కి దావా వేస్తాడా అని భయం వేసి ఎలాగో అలా అతన్ని బతిమాలి క్రిందకి దింపేశాను. సర్ హికర్ సన్ వారు తాటి చెట్టు ఎక్కే ప్రయత్నం చేస్తున్న ఫోటో ఇక్కడ జత పరిచాను. ఆఫ్ కోర్స్..ఎవడైనా ఎన్ని మిలియన్ డాలర్లకీ మన మీద దావా వేసినా ఆ మల్చ్ బస్తాలు, నా వస్త్రాలూ అన్నీ కలిపి మన ఆస్థి మొత్తం అందులో అర శాతం కూడా ఉండదు.  వాడికి...అనగా దావా వేసిన వాడికి దక్కేది నాలుగు వంకాయలూ, ఓ తాటి చెట్టే! ప్రతి వాదికి..అంటే నాకు పెద్ద నష్టం ఉండదు, పైగా నా మిలియన్ డాలర్ల దావా పడిందోచ్ అని గొప్పలు చెప్పుకో వచ్చును.



ఏది ఏమైతేనేం....గత రెండు నెలలలో మా ఇంటికి రోజూ వచ్చి మదర్పిత కోకోకోలాలు, ఇతర ద్రావకాలు తాగి మొదటి నెలలో మా ఇంటి ముందూ, వెనకా తీర్చి దిద్దాడు మా చేతి పని వాడు..సర్ ఎర్ల్ హికర్ సన్. మధ్యే మధ్యే నేను కూడా ఓ చెయ్యి వేసి కూరగాయలూ, పూల మొక్కలూ వేసుకున్నాను. నేను కష్ట పడి పెంచుకుంటున్న పూల వనం మధ్య వన కన్యలా కూచుని కిచ కిచలాడుతున్న మా క్వీన్ విక్టోరియా ఫోటో ఇక్కడ జతపరుస్తున్నాను...సరదాకి.

ఈ ఫోటోలో మీకు వాటర్ ఫౌంటెన్, (ఈ మాటకి కూడా తెలుగు

మాట నాకు తెలియదు. నీళ్ళ కుండీ, నీరు వెదజల్లు యంత్రము వగైరా మాటలు ఎబ్బెట్టుగా ఉంటాయి. ఎబ్బెట్టు అనే మాట ఈ తరం వారికి అర్థం కాక పోతే నేను అది ఇంగ్లీషులో చెప్ప లేని నిస్సహాయుడిని అనగా ఐ కెనాట్ హెల్ప్) ఆ వాటరు ఫౌంటెను చుట్టూ ...చాంగ్ క్రై షేక్, కింగ్ హంగ్ హున్, మావో సె టుంగ్ మొదలైన పూల మొక్కలు కనపడితే కంగారు పడకండి...వాటినే మనం మందారాలు, బంతి, మల్లె, కనకాంబరం, బోగన్ విలియా వగైరా పేర్లతో పిలుస్తాం. ఇవన్నీ కేవలం చైనా, వియత్నాం వారి నర్సరీ అనబడే మొక్కల కొట్లలో మాత్రమే ఆయా పేర్లతో దొరుకుతాయి. ఇక మీకు చెంగ్ పై చింగ్, హున్ కోన్ కెన్ అనగా ..వంగ, బెండ, చిక్కుడు వగైరాలు మా గరాజ్ వెనకాల దాకున్నాయి.

మరి ఈ హికర్ సన్ దొర ఈ నెల ఉద్ధరించిన పునరుద్ధరణ కార్యక్రమం మరొకటి ఉంది. ఈ చేతి పని వాడికి ఇంట్లో రంగులు వెయ్యడం రాదు బాబోయ్ అని తెలియక ఆ పని కూడా అతనికి అప్పజెప్పి..ఇప్పుడు దాన్ని రిపేరు చేయించు కోవడంలో పడ్డాను. ఇంట్లో గోడలకి వెల్ల వేయించుకోవడం లో వచ్చే ఈతి బాధలు వచ్చే నెల హికర్సనోదంతంలో వివరిస్తాను.

**COMMENTS**